క్లుప్తంగా...

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: చెట్ల నరికివేత కారణంగా మంగళ వారం గుండ్లపోచంపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మైసమ్మగూడ, మల్లారెడ్డి కళాశాలలు, మైసమ్మగూడలోని అన్ని కళాశాలలకు, వసతి గృహాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



మృతురాలి కుటుంబీకులను పరామర్శిస్తున్న జంగయ్య యాదవ్, మల్లేశ్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో అనారోగ్యంతో బొడ్డు పోచమ్మ మంగళ వారం మృతిచెందింది. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త జంగయ్యయాదవ్, కౌన్సిలర్ మల్లేశ్ మృతురాలి నివాసానికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం జంగయ్యయాదవ్ రూ.5 వేలు, కౌన్సిలర్ మల్లేశ్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మల్లేశ్, నర్సింహులు, మంకయ్య, స్టీవెన్, శ్రీశైలం, వెంకటేశ్, బాలయ్య, నగేశ్, నరేశ్ పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయానికి విరాళం



సుధీర్‌రెడ్డికి విరాళం అందజేస్తున్న లింగంయాదవ్

ఘట్‌కేసర్: ప్రతాపసింగారంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న గుబ్బరిగుట్ట మైసమ్మ అమ్మవారి ఆలయానికి చౌదరిగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు లింగంయాదవ్ మంగళవారం విరాళమిచ్చారు. గ్రామంలోని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నివాసంలో కలిసి రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణయాదవ్, రవిగౌడ్, శ్రావణ్‌గౌడ్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి బీజేపీ అభివృద్ధి, ఇటీవల నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లపై చర్చిస్తున్న ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు హనుమాన్, కిసాన్ మోర్చా జిల్లా నాయకుడు మహిపాల్‌రెడ్డి.
– ఘట్‌కేసర్

అన్నింటా ఆమే..



మేడ్చల్ నియోజకవర్గంలో అధిక శాతం మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు

- 5 మంది ఎంపీడీఓలు, నలుగురు ఎంపీపీలు, ఇద్దరు జెడ్పీటీసీలు
- ఒక మేయర్, నలుగురు మున్సిపల్ చైర్‌పర్సన్లు
- 14 మంది కార్పొరేటర్లు, 61 మంది కౌన్సిలర్లు మహిళలే..

మేడ్చల్ నియోజకవర్గంలో మహిళల్లో చైతన్యం వెల్లివిరిసింది. అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవడంతో నియోజకవర్గంలో మహిళల రాజ్యం కొనసాగుతుంది. ఏడు మున్సిపాలిటీలు, ఒక కార్పొరేషన్, 5 మండలాలు, జిల్లా పరిషత్‌లో అగ్ర భాగంలో మహిళలు ఉండటంతో మహిళలే పాలకులుగా ఉండటంతో మహిళా ఆధిపత్యం సాగుతుంది. ఎంపీపీ నుంచి గ్రామ కార్యదర్శి వరకు, అదేవిధంగా తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీపీలు, చైర్‌పర్సన్లు అధికంగా మహిళామణులే ఉన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ప్రజాప్రతినిధులు, నాయకురాళ్లు, అధికారినులపై సాక్షి ప్రత్యేక కథనం.

మేడ్చల్: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఐదు మంది మహిళా ఎంపీడీఓలు ఉన్నారు. నలుగురు ఎంపీపీలు, ఇద్దరు జెడ్పీటీసీలు, ఇద్దరు వైస్ ఎంపీపీలు, ముగ్గురు తహసీల్దార్లు, ఇద్దరు ఎంపీఓలు, నలుగురు ఏఓలు, ఇద్దరు ఏఈఈలు, 10 మంది కార్యదర్శులు, డాక్టర్లు నలుగురు మహిళలే ఉన్నారు. ఏడు మున్సిపల్ చైర్‌పర్సన్లలో నలుగురు మహిళా చైర్‌పర్సన్లు ఉన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్‌గా కావ్య ఉన్నారు.

శామీర్‌పేట మండలంలో...

శామీర్‌పేట మండలంలో ఎంపీపీగా దాసరి యెల్లుబాయి, జెడ్పీటీసీగా అనిత, వైస్ ఎంపీపీగా సుజాతలు పదవుల్లో కొనసాగుతున్నారు. శామీర్‌పేట మండల వ్యాప్తంగా 6 ఎంపీటీసీ స్థానాలకు గాను 3 స్థానాల్లో మహిళలు పదవుల్లో ఉన్నారు. అలాగే మండల అభివృద్ధి అధికారినిగా వాణి, మరో నలుగురు మహిళా అధికారులు విధులు నిర్వహిస్తున్నారు.

మూడుచింతలపల్లి మండలంలో...

మూడుచింతలపల్లి మండలంలో ఎంపీపీగా వనం దాస్ హారిక కొనసాగుతుండగా మండల వ్యాప్తంగా 6 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 2 స్థానాల్లో మహిళలే ఉన్నారు. తహసీల్దార్‌గా వాణీరెడ్డి, మండల వ్యాప్తంగా నలుగురు మహిళ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు.

తూముకుంట మున్సిపాలిటీలో...

దేవరయాంజాల్‌కు చెందిన పన్నాల వాణి తూముకుంట మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా పదవిలో ఉన్నారు. మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారిగా మేఘన బాధ్యతలు నిర్వహిస్తోంది. మున్సిపాలిటీ వ్యాప్తంగా 16 కౌన్సిలర్ స్థానాలకు గాను 8 స్థానాల్లో మహిళ కౌన్సిలర్లు ప్రజలకు సేవలందిస్తున్నారు.

కీసర మండలంలో...

మండలంలోని మహిళా అధికారులు, తహసీల్దార్ గౌరీ వత్సల్య, ఎంపీడీఓ రమాదేవి, వ్యవసాయాధికారి మాధవిలత, మెడికల్ ఆఫీసర్ సరితారెడ్డి, ఎంపీపీ ఇందిరా, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, కమిషనర్‌గా వాణీరెడ్డి ఉన్నారు. అదేవిధంగా ఐదు మంది సర్పంచ్‌లు, నలుగురు ఎంపీటీసీలు, నలుగురు మహిళా అధికారులు, నలుగురు గ్రామ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్నారు. నాగారంలో 10 మంది, దమ్మాయిగూడలో 10 మంది మహిళా కౌన్సిలర్లు ఉన్నారు.

పోచారం మండలంలో...

పోచారం మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 18 మంది కౌన్సిలర్లు, నలుగురు కోఆప్షన్ సభ్యులు ఉన్నారు. వీరిలో 9 మంది కౌన్సిలర్లు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు మహిళలే. అంటే సగభాగం మహిళలదే కావడం గమనార్హం. కాగా, మున్సిపల్ అధికారుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారిగా మౌనిక విధులు నిర్వర్తిస్తూ మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచారు.

మేడ్చల్ మండలంలో...

మేడ్చల్ మండలంలో ఐదు మంది ఎంపీటీసీలు, ఎనిమిది మంది మహిళా సర్పంచ్‌లుగా ఉన్నారు. ఎంపీపీగా రజితరెడ్డి, జెడ్పీటీసీగా శైలజ, మండల కోఆప్షన్‌గా రుక్సానా ఉన్నారు. అదేవిధంగా ఎంపీడీఓ పద్మావతి, తహసీల్దార్ సరిత, ఏఓ అర్చన, ఎంపీఓ వినూత్న, మున్సిపల్ డీఈ విజయలక్ష్మీ, వైద్యురాలు వంటి కీలక పోస్టుల్లో మహిళలే ఉన్నారు. మేడ్చల్ మున్సిపల్, గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్లుగా దీపిక, లక్ష్మీలు ఉన్నారు. రెండు మున్సిపాలిటీల్లో 16 మంది మహిళా కౌన్సిలర్లు ఉన్నారు.

ఘట్‌కేసర్ మండలంలో...

ఐదుగురు మహిళా సర్పంచ్‌లు, వైస్ ఎంపీపీ జంగమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, ఎంపీడీఓ అరుణారెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మీ, మండల పశువైద్యురాలు పద్మిని, మండల పరిషత్ సూపరింటెండెంట్ పద్మావతి వంటి కీలక పోస్టుల్లో మహిళలే ఉన్నారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ఉండాలి



మండలంలో చిన్న వయసులో మహిళ సర్పంచ్‌గా ఎన్నిక కావడం సంతోషంగా ఉంది. మహిళగా తోటి మహిళలను చైతన్య పరచడమే లక్ష్యంగా పని చేస్తున్నాను. ప్రతి అభివృద్ధి పనిలో మహిళలను భాగస్వామ్యం చేస్తున్నాను. మహి ళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డ్వాక్రా మహిళలతో సేంద్రియ ఉత్పత్తులు, కల్తీ లేని ఆహార పదార్థాల ను విక్రయించే అవుషాపూర్ ఫుడ్స్‌ను స్థాపించి ప్రోత్సహిస్తున్నాను. మహిళలు ఆత్మవిశ్వాసంతో ఉండాలి.

– గీతా భాగ్యరెడ్డి సర్పంచ్, డబీల్‌పూర్

స్వేచ్ఛగా సమాజాన్ని అభివృద్ధి చేయాలి



మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనేదే నా అభిమతం. భర్తల చాటు కాకుండా మహిళలు స్వేచ్ఛగా పనిచేసి సమాజాన్ని అభివృద్ధి చేయాలి. భర్తల, పార్టీల నేతల సహకారాలు తీసుకుంటూ తమకంటూ ప్రత్యేక శైలిని ఏర్పర్చుకుని మండల అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

– రజిత రాజమల్లారెడ్డి, ఎంపీపీ, మేడ్చల్

మహిళల రాజ్యంలో పని చేయడం ఆనందంగా ఉంది



మేడ్చల్ నియోజకవర్గంలో అధికంగా మహిళా అధికారులు, మహిళా ప్రజాప్రతినిధులు ఉండటం ఆనందంగా ఉంది. అందరూ మహిళలే ఉండటంతో అభివృద్ధి వేగంగా జరుగుతుంది. ఒక కుటుంబంలా మహిళలు పని చేస్తున్నాం. ఒక వైపు సమాజంలో జరుగుతున్న విషయాలను గ్రహిస్తూనే తమకున్న పరిధిలో తాము శక్తి మేరకు పని చేస్తూ మహిళలు ఎందులో తక్కువ కాదని నిరూపిస్తున్నాం.

– పద్మావతి ఎంపీడీఓ మేడ్చల్

చైర్‌పర్సన్‌గా అభివృద్ధి చేస్తున్నా..



అధిక శాతం ప్రజాప్రతినిధులు, అధికారులు మహిళలే ఉండటం చాలా గర్వంగా ఉంది. ఎక్కడ కలిసినా ఆప్యాయంగా పలకరించుకుంటూ అభివృద్ధిపై పోటీ పడుతున్నాం. ఒక మహిళ ఇళ్లను ఎలా మంచిగా తీర్చుకుంటుందో తమకందిన పదవులతో తమ స్థాయిలో పట్టణాలను అభివృద్ధి చేస్తున్నాం.

– దీపిక, చైర్‌పర్సన్, మేడ్చల్ మున్సిపాలిటీ

అన్ని రంగాల్లో భాగస్వాములు కావాలి



ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి. మగవారికి దీటుగా రాణిస్తూ చేస్తూ ఆర్థికంగా.. సామాజికంగా.. స్థిరపడినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుంది. మహిళల ఆర్థికాభివృద్ధి కొరకు ప్రభుత్వాలు పలు రుణాలతో పాటు పథకాలను ప్రవేశపెట్టాయి. వాటిని ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలి.

– మేకల కావ్య, మేయర్, జవహర్‌నగర్

బ్యాంకు లింకేజీలో రుణ లక్ష్యం చేరువలో మేడ్చల్

- స్త్రీనిధి రుణాల్లో ప్రస్తుత ప్రగతి 70.91 శాతం
- ఈ నెలాఖరు కల్లా లక్ష్యాన్ని అధిగమించేలా చర్యలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: స్వయం సహాయక బృందాల్లోని మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఈ రుణాలను వినియోగించుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి దిశగా అడుగేస్తున్నారు. జిల్లాలోని అన్నీ మండలాల్లో నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించడం ద్వారా ముందంజలో ఉంది. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ స్వయం సహాయక సంఘాలకు 2022–23 ఆర్థిక సంవత్సరం గడువు ముందే వంద శాతానికి మించి బ్యాంకు లింకేజీ రుణాలను పంపిణీ చేయడంతో తెలంగాణలో నాలుగోవ స్థానంలో నిలిచింది.

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో సుమారు 118 గ్రామైక్య సంఘాలు, 3,361 వరకు స్వయం సహాయక బృందాలు ఉన్నాయి. అందులో ప్రస్తుత 2022–23 ఆర్థిక సంవత్సరంలో 2,785 సంఘాలకు రూ.152.92 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచే గ్రామీణాభివృద్ధి శాఖ జిల్లా అధికారులతో పాటు స్థానిక ఐకేపీ అధికారులు కృషి చేస్తున్నారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటిస్తూ రుణాలకు అర్హత కల్గిన సంఘాలను గుర్తించి బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు ఇప్పిస్తున్నారు.

బ్యాంకు లింకేజీ రుణ పంపిణీలో ముందంజ...

రుణ వితరణలో జిల్లాలోని ఐదు మండలాలు లక్ష్యానికి మించి రుణాలు అందించి ముందంజలో ఉన్నాయి. ఘట్కేసర్ మండలంలో 706 సంఘాలకు రూ.43.52కోట్లు, కీసర మండలంలో 535 సంఘాలకు రూ.21.19 కోట్లు, మేడ్చల్ మండలంలో 571 సంఘాలకు రూ.30.18 కోట్లు, ఎంసీపల్లిలో 440 సంఘాలకు రూ.24.66 కోట్లు, శామీర్‌పేటలో 553 సంఘాలకు రూ.33.36 కోట్లు పంపిణీ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ఈ నెల 31తో ముగుస్తున్నందున లక్ష్యాన్ని అధిగమించి 110 శాతానికి బ్యాంకు లింకేజీ రుణ పంపిణీ చేరేలా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ చర్యలు తీసుకుంటోంది.

లక్ష్యాన్ని అధిగమించేలా...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ 2022–23 ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా స్త్రీనిధి రుణాల పంపిణీలో లక్ష్యాన్ని అధిగమించేలా చర్యలు తీసుకుంటోంది. జిల్లాలోని ఐదు మండలాల పరిధిలోని 2,304 స్వయం సహాయక సంఘాలకు రూ.17.27 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ ఇప్పటి వరకు రూ.12.24 కోట్ల (70.92 శాతం) రుణాలను మాత్రమే అందజేశారు. మిగతా స్త్రీనిధి రుణాలను ఈ నెలాఖరు కల్లా స్వయం సహాయక సంఘాలకు పంపిణీ చేయడం ద్వారా లక్ష్యాన్ని అధిగమించేలా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ చర్యలు తీసుకుంటోంది.

మూడిళ్లలో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

మేడ్చల్: పట్టణంలోని కిష్టాపూర్ అర్చన కాలనీలోని మూడిళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. అర్చన కాలనీలో నివాసముంటున్న శ్రీనివాస్‌రాజు, హన్మంత్‌రెడ్డి ఇళ్లలో దొంగలు తాళాలు పగుల గొట్టి చోరీకి పాల్పడ్డారు. హన్మంత్‌రెడ్డి ఇంట్లో నాలుగు పోర్షన్లు ఉండగా రెండు గదుల్లో వర్కింగ్ ఉమెన్స్ అద్దెకు ఉంటున్నారు. వారు డ్యూటీలకు వెళ్లడంతో రాత్రి ఇంటికి రాలేదు. అందులో ఒక యువతికి 1వ తేదీన వేతనం రావడంతో ఇంట్లోనే పెట్టి డ్యూటీకి వెళ్లింది. దొంగలు ఇంటి తాళాలు పగుల గొట్టి అక్కడ ఉన్న రూ.25 వేలు దోచుకెళ్లారు. కాగా హన్మంత్‌రెడ్డి ఇంట్లోనూ దొంగలు చొరబడి చోరీకి యత్నించగా ఎలాంటి నగదు, ఆభరణాలు వారికి లభించ లేదు.

- అదే కాలనీలో క్యాంటీన్ నడుపుతూ జీవనం సాగించే శ్రీనివాస్‌రాజు, రాణిలు నివాసముంటున్నారు. రాత్రి క్యాంటీన్‌లో ఉండటంతో వారుంటున్న ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న 10 తులాల బంగారం, రూ.45 వేల నగదును దోచుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకుని క్లూస్‌టీం ద్వారా వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో భాగస్వాములు కావాలి



సంస్కృతి టౌన్‌షిప్‌లో మొక్కలు నాటుతున్న భారత జాగృతి సమితి జిల్లా కోకన్వీనర్ రజితారెడ్డి

పోచారం: అతివలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని భారత జాగృతి సమితి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోకన్వీనర్ రజితారెడ్డి అన్నారు. పోచారంలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో మంగళవారం జరిగిన మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని టౌన్‌షిప్‌లోని ఏ8 బ్లాక్ వద్ద మొక్కలు నాటి, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఇందిరా ప్రియదర్శిని, కార్యవర్గ సభ్యులు ప్రతిభ, ప్రగతి, మంజుల పాల్గొన్నారు.

సుప్రభాత్ టౌన్‌షిప్–1లో...

ఘట్‌కేసర్: కొర్రెముల్ సుప్రభాత్ టౌన్‌షిప్–1లో ఆ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బంగారి రాజయ్య, ప్రధాన కార్యదర్శి బంగారి మల్లయ్య, కార్యదర్శి ప్రకాశ్, వార్డుసభ్యులు అరుంధతి, గొబ్బెరి లక్ష్మమన్నెం పాల్గొన్నారు.



మేడ్చల్: ఆర్టీసీ డిపోలో నిర్వహించిన సంబరాల్లో ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ సువర్ణరాణి తదితరులు



సుప్రభాత్ టౌన్‌షిప్‌లో మహిళా దినోత్సవం వేడుకలు



మేడ్చల్: గిరిజన మహిళలతో కలిసి హోలీ వేడుకలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి



ఘట్‌కేసర్: కరీంగూడ రోడ్డులో కామ దహనంలో చైర్‌పర్సన్ పావనీయాదవ్, కౌన్సిలర్ రవీందర్

ఘనంగా హోలీ సంబరాలు

హోలీ సంబరాలు మేడ్చల్ నియోజకవర్గంలో మంగళవారం అంబరాన్నంటాయి. ఈ పర్వదిన వేడుకలో భాగంగా ముందు రోజైన సోమవారం రాత్రి వివిధ గ్రామాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని కాలనీలు, బస్తీల్లోని ప్రధాన కూడళ్ల వద్ద కాముడి దహన కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున నుంచి హోలీ సంబరాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా చిన్నారులు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు వేడుకలో పాల్గొని ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముఖ్యంగా స్నేహితులు, బంధువులు ఒక చోట చేరి ఉత్సాహం హోలీ జరుపుకున్నారు.

భలే గిరాకీ..

హోలీ పర్వదినం సందర్భంగా రంగులతో పాటు టమాటాలకు, గుడ్లకు గిరాకీ పెరిగింది. ఉదయం నుంచి చిన్నారులు, యువత రంగుల కోసం.. గుడ్ల కోసం దుకాణాలకు ఎగబడ్డారు. దీంతో కిరాణ దుకాణ సముదాయాలు కిటకిటలాడాయి.

– మేడ్చల్ జోన్ బృందం



ఘట్‌కేసర్: హోలీ వేడుకల్లో బీజేపీ మండలాధ్యక్షుడు ప్రవీణ్‌రావు, నరేశ్‌ముదిరాజ్ తదితరులు



కీసర: చీర్యాలలో హోలీ సంబరాల్లో ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్ తదితరులు



కీసర: రాంపల్లిలో హోలీ సంబరాల్లో చిన్నారులు



జవహర్‌నగర్: బృందావన్ కాలనీలో...



ఘట్‌కేసర్: రాంనగర్‌లో సంబరాల్లో విద్యార్థినులు





అరకొర వసతులతో మరుగుదొడ్లు ఇలా..

సమస్యలతో సర్కారు బడి సతమతం

- సరైన మౌలిక వసతులు లేక కొట్టుమిట్టాడుతున్న దమ్మాయిగూడ ప్రభుత్వ పాఠశాల
- ఇబ్బందుల మధ్యనే విద్యార్థుల చదువులు
- కొత్త భవన నిర్మాణం చేపట్టాలంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల విన్నపాలు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. సమస్యలతో సహవాసం చేస్తూనే విద్యార్థులు తమ చదువులను కొనసాగిస్తున్నారు. ఒకే భవన సముదాయంలో కొనసాగుతోన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సుమారు వెయ్యి మంది విద్యార్థులుండటంతో పాఠశాలకు ఉదయం వచ్చినప్పటి నుంచి సాయంత్రం తిరిగి వెళ్లే వరకు ఇబ్బందుల మధ్య విద్యార్థుల చదువులు కొనసాగుతున్నాయి. కేవలం 500 గజాల లోపే ఉన్న స్కూల్ భవన స్థలంలో రెండు పాఠశాలలు కొనసాగుతున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉదయం తరగతి గదుల్లోనే ఉంటూ విద్యార్థులు ప్రార్థన చేయాల్సి వస్తోంది. తరగతి గదుల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను కూర్చోబెట్టి పాఠాలు చెప్పాల్సి వస్తోందని, ముమ్ముందు పరిస్థితి ఎలా అని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, క్రీడాస్థలం, వంటశాల తదితర సౌకర్యాలు లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. సమస్యలను ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రతి నిత్యం పాఠశాలకు సుమారు 300 వరకు బాలురు, 400 వరకు బాలికలు పాఠశాలకు హాజరవుతుంటారు. కానీ పాఠశాలల్లో అరకొర వసతులతో బాలికలకు, బాలురకు చెరో 5 చొప్పున మూత్రశాలలు(మరుగుదొడ్లు) ఉన్నాయి. ఇంటర్‌వెల్, మధ్యాహ్న సమయాల్లో విద్యార్థులు టాయిలెట్స్‌కు వెళ్లాలంటే పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఒక్కోసారి మరుగుదొడ్లలో నీటి వసతి సరిగ్గాలేని కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పాఠశాల బయటకు వెళ్లి ప్రమాదాల బారినపడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

ఆరుబయటనే మధ్యాహ్న భోజనం...

పాఠశాలల్లో వంటశాల లేనికారణంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టేందుకు పాఠశాల వరండాలోనే మధ్యాహ్న భోజనం వండటం జరుగుతుంది. వంట చేసే సమయంలో తరగతి గదుల్లోకి పొగ వెళ్లడంతో విద్యార్థులు ప్రతిరోజు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక మధ్యాహ్న భోజనం తినాలంటే కూడా విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇక క్రీడల సంగతి దేవుడెరుగు. చదువుకోవడానికే నానా తంటాలు పడుతున్న విద్యార్థులు క్రీడలు ఆడుకుందామంటే స్థలమే లేదు.

కేటాయించిన స్థలంలో భవన నిర్మాణమెప్పుడో..?

దమ్మాయిగూడ మున్సిపాలిటీలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి కొన్నేళ్ల క్రితం సర్వే నంబర్.541లో సుమారు ఎకరం స్థలాన్ని కేటాయించిన అధికారులు, పాలకులు ఇప్పటి వరకు పాఠశాల నిర్మాణానికి నిధులు కేటాయించలేదు. దీంతో ప్రభుత్వ స్థలం ఓ వైపు అన్యాక్రాంతమవుతుంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి దమ్మాయిగూడలో అన్ని వసతులతో కూడిన ప్రభుత్వ పాఠశాలను నిర్మించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ఆరుబయటే వంట చేస్తున్న దృశ్యం